క్లుప్తంగా

దావాలపేటలో 104 వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని దావాలపేట గ్రామంలో గురువారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యా ధికారి పుష్పాంజలి శిబిరంలో దావాలపేటతో పాటు బూడిపేట గ్రామాలకు చెందిన 78 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎండల తీవ్రత పెరుగుతోందని, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వైద్యాధికారి సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

27న ఉపసర్పంచ్ ఎన్నికలు

బొండపల్లి: మండలంలోని వేండ్రాం, గరుడుబిల్లి,గొట్లాం గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఉపసర్పంచ్ పదవులకు ఈనెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ఆర్. రఘుపతిరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో 27న ఉద యం 11 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గరుడుబిల్లి ఎన్నికల అధికారిగా పి.అప్పలనాయుడు, వేండ్రాం ఎన్నికల అధికారిగా ఏ.రఘుతిరావు, గొట్లాం ఎన్నికల అధికారి గా సునీల్ వినోద్‌ను నియమించినట్లు స్పష్టం చేశారు.

సారాకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ విజయలక్ష్మి

గంట్యాడ: నాటు సారా తాగడం, తయారీ, విక్రయాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ ఎం.విజయలక్ష్మి ప్రజలకు సూచించారు. సారాతో కలిగే అనర్థాలపై మండలంలోని డి.కె.పర్తి, మొసలిఖండి గ్రామాల్లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సారాకు బానిసగా మారడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కుటుంబాలు నాశనమవుతాయని అన్నారు. ఆరోగ్యాన్ని, జీవితాలను పాడు చేసే సారాను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్ సీతమ్మ, వీఆర్‌ఓ గణపతి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్, ఫారెస్ట్ బీటు ఆఫీసర్ ఎస్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: బోడసింగిపేట గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురయ్యిందని ఆ గ్రామానికి చెందిన బగ్గా ఎర్రయ్య ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్ట ర్‌కు ఫిర్యాదు చేశారు.కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు బోడసింగిపేటలో గురువారం పర్యటించా రు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రభుత్వ బందను పరిశీలించారు.మండల, సచివాలయ సర్వేయర్లతో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయించారు. తహసీల్దార్ వెంట వీఆర్‌ఓ ప్రసాద్, తదితరులున్నారు.

ఉత్తుత్తి పట్టాలతో మోసం చేయడం తగదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

కొత్తవలస: మండలంలోని పలుగ్రామాల్లో పేదలకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఉత్తుత్తి పట్టాలు ఇచ్చి మోసం చేసిందని సీపీఎం నాయకుడు గాడి అప్పారావు ఆరోపించారు. గతంలో పట్టాలు పొందిన వారితో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. అప్పారావు మాట్లాడుతూ ప్రధానంగా పాత సుంకరపాలెం గ్రామంలో 15 మందికి గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, వారికి స్థలాలను మాత్రం నేటికీ చూపించలేదని అన్నారు. స్థలాలు కేటాయించకుండా పట్టాల పేరుతో ప్రజలను మోసం చేయడం తగదన్నారు.ఈ సమస్య మండలంలోని పలు గ్రామాల్లో ఉందని,ఇప్పటికైనా అధికారులు ,పాలకులు స్పందించి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ నీలకంఠరావుకి వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు గొంప కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం సాధిస్తోంది...

- ఈపీకేలో ఒక్కోమెట్టు ఎక్కుతున్న ఎస్.కోట ఆర్టీసీ డిపో
- 2022 నుంచి క్రమంగా పెరుగుతున్న ఈపీకే
- పరిమిత వనరులు, సిబ్బందితోనే ప్రగతి వైపు పరుగులు
- ఓఆర్ సాధించే దిశగా అడుగులు



ఎస్.కోట ఆర్టీసీ డిపో

శృంగవరపుకోట: పరిమిత వనరులు.. నియమిత షెడ్యూళ్లు... కాలం చెల్లిన బస్సులు...కలిసిరాని రూట్లు ఇలా ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఉన్నా...ఈపీకే(ఎర్నింగ్స్ పర్ కిలోమీటర్) పెంచాలని, ఓఆర్(ఆక్యుపెన్సీ రెషియో) సాధించాల ని స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగులు, సిబ్బంది అంతా కలిసి పనిచేసి అనుకున్నట్టు ఒక్కో మెట్టు ఎక్కి ఈపీకే సాధించారు. ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు ఒక దశలో ఎస్.కోట డిపోను ఎత్తేయాలని యోచన చేశారు. నాడు స్థానికులు, వివిధ పార్టీల నేతల పోరాటాలతో నాటి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతో నష్టాలు, కష్టాలు ఉన్నా నెట్టుకొస్తున్నారు. పాత కష్టాలు, నష్టాల నుంచి గట్టెక్కేందుకు కొన్నేళ్లుగా సిబ్బంది కష్టపడి పని చేస్తున్నారు. నిత్యం 17,000 కిలోమీటర్ల పరుగులు తీస్తూ రోజుకు సుమారు 18,000 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. డిపోలో 45 షెడ్యూళ్లు, 8 రూట్లలో బస్సులు తిరుగుతున్నాయి. డిపోకు జీవనాడి అయిన ఎస్.కోట -విశాఖపట్నం రూట్‌లో 13 షెడ్యూళ్లు, ఎస్.కోట-అరుకు రూట్‌లో 7 షెడ్యూళ్లు, విశాఖ -కించుమండ రూట్‌లో 5 షెడ్యూళ్లు, ఎస్.కోట నుంచి విజయనగరం వయా ధర్మవరం మీదుగా 2 షెడ్యూళ్లు, వయా జామి, వయా తలారి చెరొక షెడ్యూల్, వయా తాటిపూడి 4 షెడ్యూళ్లు, ఎస్.కోట - గుమ్మకోట రూట్‌లో ఒక షెడ్యూల్‌లో బస్సులు నడుస్తున్నాయి.

ఈపీకేలో ఓకే.. ఓఆర్ సాధించే దిశగా

సర్వీసులు తగినన్ని లేకున్నా, నియమిత రూట్లు ఉన్నా, కాలం చెల్లిన బస్సులు మొరాయిస్తున్నా, కష్టాలు, నష్టాలు కమ్ముకుంటున్నా స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగులు ఈపీకే సాధించడంలో సఫలీకృతులవుతున్నారు. 2022-23లో 38.21 శాతం, 2023-24లో 39.93శాతం, 2024-25లో 39.68 శాతం ఈపీకే సాధించారు. ఆక్యు పెన్సీ రేషియో(ఓఆర్)లో 2022-23, 2023-24లో 75శాతం సాధించగా 2024-25లో 73శాతం సాధించారు. పెరిగిన ఆటోలు, ప్రైవేటు వాహనాల సంఖ్య, కాలం చెల్లిన బస్సుల ప్రభావం ఓఆర్‌పై పడుతోంది. ఇప్పటికే పలు దఫాలు కొత్త బస్సులు కావాలని స్థానిక డిపో ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేసి న విషయం విధితమే. బస్సులు, కొత్త రూట్లు, సిబ్బందిని కేటాయిస్తే మరింత ఓఆర్ సాధించే అవకాశం ఉందని, స్థానిక డిపో ప్రగతి వైపు పరుగులు తీస్తుందని ఆర్టీసీ ఉద్యోగులు అంటున్నారు.

ఉద్యోగుల సహకారంతోనే..



మంచి ఈపీకే సాధించడంలో ఉద్యోగుల కష్టం ఉంది. సిబ్బంది డిపో కోసం చేస్తున్న కష్టం మెచ్చుకోదగ్గది. డిపోకు ఉన్న ప్రధానమైన రూట్ ఎస్.కోట- విశాఖప ట్నం. ఈ రూట్‌లో మరిన్ని షెడ్యూల్స్ పెంచి, ప్రయాణ సమయాన్ని తగ్గించగలిగితే మరింత ఓఆర్, ఈపీకే సాధ్యమవుతుంది. త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు డిపోకు రానున్నాయి.

– కె.రమేష్,
ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్

భూఆధార్‌పై అసెంబ్లీలో చర్చించండి



మాట్లాడుతున్న ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాములు

గజపతినగరం: కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన భూఆధార్ కార్డులతో తలెత్తే ఇబ్బందులపై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ల్లోని ఎమ్మెల్యే లు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి చర్చించాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు విజ్ఞప్తి చేశారు. మండల కేం ద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూఆధార్ ఉన్న రైతులకే కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అమలు చేసే వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు, పెట్టుబడి సహాయం, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, పురుగు మందులు అందుతాయని అధికారులు చెబుతున్నారని అన్నారు. జిరాయితీ భూములున్న రైతులకే భూఆధార్ కార్డులు ఇస్తామని చెబుతూ, వారి వివరాలనే ఫార్మర్ రిజిస్ట్రీలో అధికారులు నమోదు చేస్తున్నారని చెప్పారు. డీపట్టాదారులు, పోడు పట్టాలు న్న గిరిజనులు, ఇనాం భూములు సాగు చేసుకుంటున్న రైతులు, కౌలు రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయడం లేదని, ఇది ఎంతవరకు సమంజస మని ప్రశ్నించారు. తాతముత్తాతల కాలం నుంచి డీపట్టా,పోడు పట్టాలు, ఇతర భూహక్కులు ఉన్న దళిత,గిరిజనులు తమ భూములపై హక్కులు కోల్పోతామేమో నని ఆందోళన చెందుతున్నారని అన్నారు. గతంలో డీపట్టా,పోడు పట్టాలు పొందిన దళిత,గిరిజన రైతులకు వారి భూముల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూర య్యేవని గుర్తు చేశారు. ఇది వరకు డీపట్టా, పోడు పట్టాదారులకు కూడా వ్యవసాయ సంబంధిత పథకాలు అందే వని, భూఆధార్ అమలైతే వారంతా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దళితులను మనుషులుగా చూడకుండా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందని, వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు తలాడిస్తూ ప్రజలు, రైతుల ప్రయోజనాలను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

మెరకముడిదాం: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఆ పాఠశాల ప్రత్యేక అధికారి గౌష్యాబేగం గురువా రం ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాల లో 6వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు, 7,8,9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈనెల 22న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై ఏప్రిల్ 11తో ముగియనుందని పేర్కొన్నారు. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత ప్రింట్‌కు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువపత్రాలు, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్‌లు, పాస్‌ఫొటో జత చేసి కేజీబీవీలో అందజేయాలని స్పష్టం చేశారు. అనాథ, బడిబయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కు కేజీబీవీలో సంప్రదించాలని సూచించారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

దత్తిరాజేరు: ఎస్.భూర్జవలస రెవెన్యూ పరిధి, సర్వే నంబర్ 69లో ఉన్న కారి చెరువు గట్టుపై చెట్లను కొంతమంది నరికి వేశారని ఆ గ్రామస్తుడు బోను తిరుపతి తహసీల్దార్ విజయ భాస్కర్, ఎస్‌ఐ రాజేష్‌లకు గురువారం ఫిర్యాదు చేశారు. చెరువు గట్టుపై ఎన్నో ఏళ్లుగా ఉన్న చెట్లను నరికేసి న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టిలో కూడా పెట్టామని ఫిర్యాదు దారుడు తిరుపతి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వర కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఆనంతరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.విద్యుత్ తీగలకు అనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో బొండపల్లి, చందకపేట, గెద్దపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరుబాటే...



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు, సీపీఎం నేతలు

శృంగవరపుకోట: దశాబ్దాలుగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని లేకుంటే ప్రజాఉద్యమాలతో ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని సీపీఎం జిలాల కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయం వద్ద పలు పంచాయతీల గిరిజనులతో కలిసి సీపీఎం నాయకులు గురువారం ధర్నా చేశారు. ఈసందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ మండలంలో రోడ్లు లేని గ్రామాలకు తక్షణం రోడ్లు మంజూరు చేయాలని, గ్రామాల్లో డ్రైన్లు నిర్మించడంతో పాటు తాగునీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. ధారపర్తి, మూలబొడ్డవర, ఎస్.కోట, మల్లిపూడి పంచాయతీల పరిధిలో పోడుభూములను సాగు చేసుకుంటున్న 274 మంది రైతులకు 2005 అటవీ హక్కు చట్టం ప్రకారం పట్టాలు మంజూరు చేయాలన్నారు. రాయవానిపాలెం నుంచి రామన్నపాలెం వరకు 5 కిలోమీటర్ల దూరం రోడ్డు, పల్లపుదుంగాడ నుంచి దబ్బగుంట వరకు, అమ్మపాలెం నుంచి గూనపాడు వరకు రోడ్లు వేయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రతీ రేషన్‌కార్డుపై 35కిలోల బియ్యం, 11 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి 200 రోజులు పనిదినాలు కల్పించి,రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, మేట్‌లకు ప్రభుత్వం ప్రకటించిన రూ.7,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 516బీ జాతీయ రహదారిలో నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అంద జేశారు. సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు సీహెచ్.ముత్యాలు, జి.నాయుడు, ఎం.నాగేశ్వరరావు, పి.రమణ, మహేష్, జి.సన్యాసిరావు, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం వైపు మళ్లిద్దాం



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ఏపీ రవీంద్ర

శృంగవరపుకోట: ప్రకృతి వ్యవసాయ, మండల సమాఖ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే రైతులను ప్రకృతి సేద్యం వైపు మళ్లించడం సాధ్యమని ఏఓ రవీంద్ర అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ, మండల సమాఖ్య సిబ్బందితో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మండల సమాఖ్య సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి సేద్యంలో పాటించాల్సిన 9 సార్వత్రిక సూత్రాలపై వీఓఏలు, వీఓఓబీలు, డ్వాక్రా సంఘాల ప్రెసిడెంట్లకు, అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం రమణ పాల్గొన్నారు.

సాగు విస్తీర్ణం పెంచేలా కృషి

బొండపల్లి: మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెంచేలా గ్రామైక్య సంఘాల వీఓఏలు కృషి చేయాలని విజయనగరం రైతు శిక్షణ కేంద్రం ఏఓ కె.గోవిందమ్మ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించా రు. ఏఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత వీఓఏలపై ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఈఓ మెర్సీ, వెలుగు ఏపీఎం కె.పెంటంనాయుడు, ప్రకృతి వ్యవసాయ రీజినల్ కో-ఆర్డినేటర్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి

- ఈఆర్‌ఓ ప్రమీలా గాంధీ



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ ప్రమీలా గాంధీ

బొండపల్లి: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి బీఎల్‌ఓలు కృషి చేయాలని ఈఆర్‌ఓ ప్రమీలాగాంధీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమా వేశ మందిరంలో మండలంలోని బీఎల్‌ఓలతో గురువారం సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పది రోజుల్లోగా తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. చనిపోయిన వారి పేర్లు, వివహం అయ్యి అత్త వారి ఇళ్లకు వెళ్లి పోయిన ఆడపిల్లల పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు.అలాగే పద్దెనిమిదేళ్లు నిండిన వారితో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. మండలంలో 52 మంది బీఎల్‌ఓలు ఉంటే కీలకమైన సమావేశమైనప్పటికీ 38 మంది మాత్రమే హాజరయ్యారని, మిగతా 14మంది ఎందుకు గైర్హాజరయ్యారని, వారికి తమ విధుల గురించి అవగాహన ఉందా లేదా అని ఈఆర్‌ఓ మండిపడ్డారు. తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తులాహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ

చీపురుపల్లి: స్వయం ఉపాధి కోసం 50 శాతం రాయితీపై అందించే రుణాల కోసం బీసీ, ఈబీసీ, కాపు, ఓసీ సామాజిక వర్గాల్లోని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మండలానికి వంద యూనిట్లు మంజూరయ్యాయని, బీసీ మహిళలకు వంద కుట్టు మిషన్లు కూడా మంజూరయ్యాయన్నారు. మహిళలకు కుట్టులో 45 నుంచి 60 రోజులు శిక్షణ ఇచ్చిన తర్వాత కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రుణాల కోసం బీసీ సామాజిక వర్గాల్లో 21 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు, కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలకు సంబంధించి 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని చెప్పారు. అర్హులు మార్చి 22లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సన్యాసమ్మ, నారాయణమ్మ అన్నారు. నీలకంఠరాజపురంలో గురువారం గ్రామసభ నిర్వహించి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేయాలని సూచించారు. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో భూసారం దెబ్బతింటుందని, వీటిని ఉపయోగించి సాగు చేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం పాడవుతుందన్నారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే కషాయాలు, ద్రవ, ఘన జీవామృతాల తయా రీ విధానాన్ని వివరించారు. అనంతరం రైతు లను సన్మానించారు. సర్పంచ్ గొటివాడ దేవి, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, స్థానిక పెద్దలు పోతల రమణ, జగ్గుబాబు, పెదనాయుడు, రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు. – వేపాడ

ప్రాంగణ నియామకాల్లో 26 మంది ఎంపిక



బలిఘట్టాం గ్రామ సమీపంలోని ప్రగతి పాలిటెక్నిక్ కళాశాలలో వీల్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. రూ.2.50 లక్షల వార్షిక వేత నంతో 26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ వనుం శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సన్యాసినాయుడు,హెచ్‌ఓడీ సీహెచ్.కార్తీక్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు. – కొత్తవలస

హామీలు అమలు చేసేదెప్పుడు..?



ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు కూటమి అనేక హామీలు ఇచ్చిందని, వాటిని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు ప్రశ్నించారు. చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల చట్టాన్ని ఏవిధంగా అమలు చేసిందో అదే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ ప్రకటించా లని, అంతవరకు ఐఆర్(మధ్యంతర భృతి) ఇవ్వాలని కోరారు.అలాగే డీఏలు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, పార్ట్ పేమెంట్స్,ఫైనల్ పేమెంట్ వంటివి ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు అందే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఆర్.సింహాద్రి, టి.మహేష్, ఆల్తి శ్రీహరి, శ్రీనివాసరావు, రామారావు, అప్పలనాయుడు, నారాయణరావు, మోహన్‌రావు, శ్రీదేవి, త్రివేణి పాల్గొన్నారు.
– మెరకముడిదాం

హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు

శృంగవరపుకోట: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు అన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆసిరాడ పైడిఅప్పారావు, జిల్లా సత్సంగ్ మామిడి సత్యనారాయణ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారిని గురువారం కలిసి గురుకులాల్లో ప్రవేశ పరీక్షల తేదీని మార్చాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన పరీక్ష ఏప్రిల్ 6వ తేదీన నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిం దని గుర్తు చేశారు. అయితే అదే రోజున శ్రీరామనవమి ఉత్సవాలు ఉన్నాయని, ఆరోజు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50లక్షల మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుందని, వారితో పాటు తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. వీళ్లందరినీ శ్రీరామ్‌లీలా ఉత్సవాలకు దూరం చేయడం సమంజసం కాదన్నారు. తక్షణం ప్రభుత్వం ప్రవేశ పరీక్ష తేదీని మార్చాలని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు రామసత్యం, సూర్యారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చదవడం, రాయడం నేర్చుకోవాలి



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సురేష్



గంట్యాడ: మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వయోజన నిరక్షరాస్యులంతా చదవడం, రాయడం నేర్చుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్ అన్నారు. వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఉల్లాస్' కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరక్రాంతి పథం, ఐసీడీఎస్ సిబ్బందితో గురువారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులకు గత మూడు నెలలుగా రాయడం, చదవడంపై శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందేనన్నారు. వారికి ఈనెల 23న పరీక్ష నిర్వహించాలని సూచించారు. ఏపీఎం ఎన్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

గంట్యాడ: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఓఏలు, ఉల్లాస్ వలంటీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్ర మంలో భాగంగా చదవడం, రాయడం నేర్చుకున్న వయోజనులకు ఈనెల 23న నిర్వహించనున్న పరీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీఓ రమణమూర్తి, ఏపీఎం సులోచనాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పీరుబండి జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

లక్కవరపుకోట: రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ప్రసాదరావు అన్నారు. రెల్లిగౌరమ్మపేట గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించి రీస ర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో రెవెన్యూ సిబ్బంది రీసర్వే చేస్తారని, వారికి రైతు లంతా సహకరించాలని కోరారు. రైతులు తమ భూముల వద్ద ఉండి సర్వే చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రీసర్వే డీటీ అప్పారావు, మండల సర్వేయర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సద్వినియోగించుకోండి

చీపురుపల్లిరూరల్(గరివిడి):భూరీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్. బంగార్రాజు సూచించారు. గరివిడి మండలంలోని ఆవగూడెం గ్రామంలో గురువారం రీసర్వే ప్రారంభించారు.ముందుగా నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రీసర్వే చేయిస్తోందని తెలిపారు. సర్పంచ్ గుడి వాడ తమ్మినాయుడు,మాజీ సర్పంచ్ మన్నెపురి సూర్యనారాయణ, ఆర్‌ఐ అచ్యుతరావు, సర్వేయర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.